క్లుప్తంగా

పద్మనాభంలో డీపీవో పర్యటన



వర్మి కంపోస్టును పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాసరావు

పద్మనాభం: చెత్తను రోడ్ల మీద వేయకూడదని, ఇళ్ల వద్దకు చెత్త సేకరణ కోసం వచ్చే బళ్లలో వేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని తునివలస, రేవిడి, పద్మనాభం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం తునివలసలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలోని వర్మి కంపోస్టును పరిశీలించారు. ఆయన వెంట ఈవోఆర్డీ మీనా కుమారి, పంచాయతీ కార్యదర్శులు రవి, పైడియ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా భారత్ ఫెస్ట్



నమూనా ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని విద్యాసాగర్ పాఠశాలలో శుక్రవారం భారత్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కె.ఎల్.ఎస్.మూర్తి, ప్రిన్సిపాల్ కె.శాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, మౌలిక సదుపాయాలు, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన పలు నమూనాలను విద్యార్థులు రూపొందించి, ప్రదర్శించారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'దివీస్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి'

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ మండల టీడీపీ నాయకులు కొసనవానిపాలెంలో శుక్రవారం సమావేశమయ్యారు. 20 ఏళ్ల క్రితం నెలకొల్పిన దివీస్‌లో క్రమ పద్ధతిలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. స్వాక్షాత్తు ఎమ్మెల్యే సిఫారసు లేఖలకే విలువ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పతివాడ రాంబాబు, అప్పారావు, లక్ష్మణరావు, పరశురాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

పీఎం పాలెం: శ్రీ రామ నవమి ఉత్సవాలను పీఎం పాలెం మూడో బస్టాప్ ఎదురుగా ఉన్న రామాలయం వద్ద ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల ఆరో తేదీన సీతారాముల కల్యాణం నిర్వహించడానికి శాశ్వత వేదిక ఎదురుగా వేలాది మంది భక్తులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఆలయం వద్ద భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ తెలియజేసింది. సీతారామ కల్యాణం అనంతరం భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో బీజేపీ నాయకులు

మధురవాడ: భారతీయ జనతా పార్టీ మధురవాడ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. పార్టీ జాతీయ కార్యదర్శి వంశీదాస్ యాదవ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ కేఎస్పీ చక్రవర్తి, బీజేపీ సీనియర్ నాయకుడు దక్షిణామూర్తి, భీమిలి నియోజకవర్గ కో కన్వీనర్ పి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో మాజీ మండల అధ్యక్షుడు యండ అప్పారావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. మండల ఉపాధ్యక్షులుగా డీఆర్‌కే రాజు, జి.అప్పారావు, కె.రమేష్ శర్మ, దుర్గాసి రాము, జి.వెంకటరామయ్య, టి.వరలక్ష్మి ప్రధాన కార్యదర్శులుగా ఎం.సుబ్బరాజు, పి.శివకుమార్, సెక్రటరీగా టి.రమ్య, డి.ధర్మరాజు, జి.కాళీఅమ్మ, ఎం.వెరియా, పి.పావని, కోశాధికారిగా ఎం.రాధామణి, సహాయ కోశాధికారిగా సాలూరు చిన్న కృష్ణ, ఇతర కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులతో రియల్ భూములకు రోడ్లు



రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం ప్రభుత్వ నిధులతో నిర్మించిన రింగ్‌రోడ్డు

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలవి.. వాటి ప్రగతి కోసం పనులేవీ జరగలేదు. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములకు మాత్రం చకచకా రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. అదీ ప్రభుత్వ నిధులతో.. పర్యావరణానికి హాని కలిగేలా పచ్చని కొండలను తవ్వి మరీ ఈ రోడ్లు నిర్మిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కాకుండా 'రియల్' వ్యాపారులకు లాభం చేకూర్చేలా చేస్తున్న పనులు వివాదాస్పదంగా మారాయి.



ప్రైవేట్ వ్యక్తుల భూముల కోసం అటవీశాఖ భూముల నుంచి వేసిన రోడ్డు

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీలో దబ్బంద గ్రామం చుట్టూ కొండల నడుమ ప్రాంతం ఇన్నాళ్లూ అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. దబ్బంద, చిన దబ్బంద, గొల్లల దబ్బంద, అప్పికొండ కాలనీ, ఎస్సీ దబ్బంద ఇలా గ్రామాలుగా విడివిడిగా ఉన్న ఈ ప్రదేశం నగరానికి చేరువగా ఉండటంతో పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చౌకగా ఉన్నప్పుడు ఎడాపెడా భూములు కొనేశారు. ఆనందపురం–పెందుర్తి జాతీయ రహదారికి దూరంగా ఉన్నట్టు అనిపించే ఈ గ్రామాలకు సొంత వాహనాలు ఉంటే తప్ప రాకపోకలు సాగించడం కష్టమే. కాలుష్యానికి దూరంగా ఉండే ఈ గ్రామంలో ప్రస్తుతం ప్రభుత్వ నిధులతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములకు రహదారులు నిర్మించడం వివాదాస్పదమైంది. అంతేకాకుండా, పచ్చని కొండలను తవ్వి అటవీశాఖ భూములలో రోడ్లు నిర్మించే వరకు మండల రెవెన్యూ అధికారులు కళ్లు మూసుకుని కూర్చున్నారు. కొండలను తవ్వేయడంతో పర్యావరణానికి ప్రమాదం ముంచుకు వస్తుందని దబ్బందవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'దారి' మళ్లిస్తున్నారు..

పంచాయతీలో సుమారు రూ.కోటి వరకు ఉపాధిహామీ, ఆర్థిక సంఘం నిధులు రియల్ వ్యాపారాల వృద్ధికి మళ్లించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఆర్అండ్‌బీ రహదారి నుంచి అప్పికొండ కాలనీ మీదుగా ఎస్సీ దబ్బందకు పూర్వం నుంచి మార్గం ఉంది. ఈ వైపు పూర్తిగా రహదారి నిర్మించవలసి ఉన్నా, కేవలం 70 ఎకరాలు ఉన్న రియల్ వ్యాపారులకు లాభం చేకూర్చేందుకే రూ.40 లక్షలతో పాక్షికంగా రహదారి పనులు జరుగుతుండడం వివాదాస్పదమైంది.

అలాగే ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి దబ్బంద హౌసింగ్ కాలనీ వరకు రూ.40 లక్షలతో నిర్మించవలసిన బీటీ రోడ్డు రింగ్ రోడ్డు పేరుతో మరో



ప్రైవేట్ వ్యక్తుల భూముల కోసం యంత్రాలతో తవ్వేసిన కొండ భాగం

రూ.40 లక్షల ఉపాధి హామీ నిధులు ఖర్చు చేసి శివారులో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములకు బీటీ రోడ్డు విస్తరించారు. కొండలకు అవతలి ఉన్న భూముల విలువ పెంచుకోవడానికి రియల్టర్లు యథేచ్ఛగా కొండలను తవ్వి ఆ మార్గంలో రహదారులు నిర్మిస్తున్నారు.

– దబ్బంద నుంచి జీవీఎంసీ మధురవాడ పరిధిలో ఉన్న గిరిజన గ్రామం శంభువానిపాలేనికి అటవీశాఖకు చెందిన ప్రాంతంలో మట్టి రోడ్డును నిర్మించారు. వాస్తవానికి ఈ మార్గంలో చేరుకోవడానికి కొండవాలులో ఉన్న రహదారిని కాదని విశాలమైన రహదారిని నిర్మించే వరకు అటవీశాఖ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చూసుకోలేదు. ఇటీవల విమర్శలు ఎక్కువగా వస్తుండటంతో నిద్రలేచిన రెవెన్యూ అధికారులు పలుచోట్ల రోడ్డుకు గండ్లు కొట్టారు.

పాత రోడ్లను వదిలేసి..

దబ్బంద శివారులో ఉన్న టిడ్కో, జగనన్న ఇళ్ల సముదాయం పేరుతో నిర్మిస్తున్న 80 అడుగుల విస్తారమైన రహదారులు వాస్తవానికి ఆ చుట్టూ ఉన్న వందల ఎకరాల రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూముల కోసం నిర్మించినవే. వీటి కోసం పూర్వం నుంచి ఉన్న రహదారులను గాలికి వదిలేసి కొత్తగా ప్రభుత్వ నిధులతో మార్గాలను నిర్మిస్తున్నారు. భౌగోళికంగా చూస్తే దబ్బంద గ్రామం నుంచి సింహాచలానికి 9.1 కి.మీ., అడవివరం 8.7 కి.మీ, నీళ్ల కుండీల జంక్షన్ 9.9 కి.మీ శొంఠ్యాం 11 కి.మీ, పెందుర్తి 13.8 కి.మీ, మధురవాడ ఒడిలో ఉన్న శంభువానిపాలెం గిరిజన గ్రామాలు కేవలం 7 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి.



అప్పికొండ కాలనీ వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములకు నిర్మిస్తున్న రహదారి

వాస్తవానికి దబ్బంద ప్రజలకు ఉపయోగకరమైన చోట్ల నిర్మించవలసిన రహదారుల ప్రతిపాదనలు రద్దు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం పని చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. చిన దబ్బంద నుంచి టిడ్కో ఇళ్లకు వెళ్లే మార్గంతో పాటు ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని కొండలను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

భీమునిపట్నం: టెన్త్, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. విశాఖ చిల్డ్రన్స్ క్లబ్, భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో భీమిలిలోని ఓ కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. డాక్టర్ కె.రమాప్రభ, డాక్టర్ రంగారావు, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ గంగారావు తదితరులు మాట్లాడుతూ ఎటువంటి కోర్సు చేయడం ద్వారా ప్రయోజనాలు ఉంటాయి, వాటిని ఎలాంటి ప్రణాళికతో చదవాలి, ప్రవర్తన ఎలా ఉండాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాయితేజ, గుణశంకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు శశి, అజయ్, వెంకటరమణ, భరత్ పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ మారు వారోత్సవం



ఈవో మురళీమోహన్‌కు వెండి పళ్లాన్ని అందిస్తున్న చంద్రశేఖర్

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి మారు వారోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి చంద్రశేఖర్ దంపతులు అమ్మవారికి రూ.50వేలు విలువ చేసే వెండి పళ్లాన్ని బహూకరించారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి బొంగరాల మురళీమోహన్‌కు దీనిని అందించారు. అలాగే ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడు సుబ్బిశెట్టి రాఘవ, కుటుంబ సభ్యులు 1500మంది భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘ అధ్యక్షులు ముమ్మిడిశెట్టి సునీల్, వాసవి కన్యకాపరమేశ్వరి సంఘ అధ్యక్షుడు పూసర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

మధురవాడ: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి.. స్వయంకృషితో ఉన్నత స్థానాలు అధిరోహించిన గొప్ప వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని చంద్రంపాలెం హైస్కూల్ హెచ్ఎం రవి అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఉప ప్రధానిగానే కాకుండా 5 దశాబ్దాల పాటు పార్లమెంటు సభ్యునిగా, కేంద్ర మంత్రిగా దేశానికి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



దుర్గాలమ్మ ఆలయ ఆవరణలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం వద్ద హైవే సర్వీసు రోడ్డులో కమిటీ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు, రిటైర్డ్ ఏసీపీ శ్యామలరావు తదితరులు పాదచారులు, భక్తులు, వాహన దారులకు చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ నిత్యం తాగునీరు అందుబాటులో ఉంటుందని, వారానికి రెండు మూడు సార్లు మజ్జిగ పంపిణీ చేస్తామని చెప్పారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

దుర్గాలమ్మ వారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకాలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీకి చెందిన శ్రీనివాసస్ ఈశో కుటుంబ సభ్యుల సహకారంతో పులిహోర, ఇతర ప్రసాదాలు అమ్మవారికి నివేదించి భక్తులకు పంచిపెట్టారు.

వంట చెరకునకు దబ్బంద ప్రత్యేకం

కట్ట రూ.25కే విక్రయం



దబ్బంద కొండవాలు ప్రాంతాల తోటల నుంచి సేకరించిన వంట చెరకు

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీకి చెందిన దబ్బంద గ్రామం వంట చెరకు సేకరణలో ప్రత్యేకంగా నిలుస్తోంది. ఈ గ్రామంలోని కొండవాలు ప్రాంతంలో జీడి, మామిడి, నీలగిరి తదితర తోటల నుంచి సేకరించిన కట్టెలను గ్రామస్తులు కట్టలుగా కట్టి సిద్ధం చేస్తుంటారు. ఈ గ్రామానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న సింహాచలం అప్పన్న దర్శనాలకు వచ్చే యాత్రికులు వంట చేసుకునేందుకు వీటిని ఉపయోగిస్తుంటారు. దీంతో దబ్బంద గ్రామంలో వందలాది మంది కట్టెల సేకరణపై ఆధారపడి జీవిస్తున్నారు. వేకువజామున కొండకు వెళ్లి 10 గంటలలోగా వీటిని సేకరించి ఇళ్లకు వెళ్తుంటారు. దబ్బంద గ్రామస్తులు ఒక్కో కట్ట రూ.25 వంతున గ్రామంలో విక్రయించగా, ఇక్కడి నుంచి తీసుకువెళ్లే వ్యాపారులు యాత్రికులకు ఒక్కో కట్ట రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తుంటారు.

7 నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 7 నుంచి పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష 'పాలిసెట్' కు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఉచితంగా బస్సు సౌకర్యంతో పాటు మెటీరియల్ కూడా అందించనున్నారు. వివరాలకు జగదీష్‌ను 90520 45905, శేషును 98660 53399 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డీసీసీబీలో కారుణ్య నియామకం

మహారాణిపేట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో కారుణ్య నియామకం జరిపారు. ఎంబీసీహెచ్ఎస్ అజిత్ కుమార్‌కు శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్, బ్యాంకు పర్సన్-ఇన్‌చార్జి మయూర్ అశోక్ డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డీవీఎస్ వర్మ సమక్షంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. డీసీసీబీ మధురవాడ బ్రాంచ్‌లో మెసెంజర్‌గా పని చేస్తున్న మాదు రాంబాబు అకాల మరణం పొందారు. అతని కుమారుడు ఎంబీసీహెచ్ఎస్ అజిత్‌కుమార్‌కు విద్యార్హతలు పరిగణనలోకి తీసుకుని నిబంధనలకు లోబడి ఉద్యోగం ఇవ్వాలని గత నెల 26న జరిగిన బ్యాంకు మహాజన సభలో తీర్మానించారు. ఇప్పుడు బ్యాంకులో 5వ కేటగిరీ ఉద్యోగిగా కారుణ్య నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ డి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పీఎం పాలెం: బాల్య వివాహాలు ప్రోత్సహించేవారు చట్టప్రకారం నేరస్తులుగా పరిగణింపబడతారని లక్ష్మీవానిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు అన్నారు. 'బాల్య వివాహాలు చట్ట విరుద్ధం' అంశంపై స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకముందే వివాహాలను ప్రోత్సహించే వారు చట్టప్రకారం శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యం, నాటుసారా ధ్వంసం



మద్యం సీసాలను ఖాళీ చేసి బకెట్‌లో వేస్తున్న సిబ్బంది

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 2020 నుంచి 2024 వరకు స్వాధీనం చేసుకున్న మద్యం, నాటు సారాలను శుక్రవారం ధ్వంసం చేశారు. ఏపీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.ఈశ్వరరావు, సీఐ చింతల వాసునాయుడు, గంగసాని అగ్రహారం వీఆర్వో గొంప వరహాలు తదితరుల సమక్షంలో మద్యం, నాటుసారాలను బకెట్‌లలో నింపి డ్రైనేజీలలో పారబోశారు. ఇందులో 42 కేసులకు సంబంధించి 180 మి.లీ. మద్యం బాటిళ్లు 1728(302 లీటర్లు), రెండు కేసులకు సంబంధించి 10 లీటర్ల నాటు సారా ఉన్నట్లు తెలిపారు.

'కొండవాలు ప్రజలకు న్యాయమైన ధరలు నిర్ణయించాలి'

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని కొండవాలు ప్రాంతాల వాసులకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాలని విశాఖ నగర ఎస్సీ, బీసీ, ఈబీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరిటి ఉమామహేశ్వరరావు కోరారు. ఆయన నివాసంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 1982లో తమ సొసైటీని స్థాపించామని, ఆ సొసైటీకి 3ఎకరాల సింహాచలం దేవస్థానం భూమిని కేటాయించాల్సిందిగా అప్పటి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పీవీజీ రాజుకు విజ్ఞప్తి చేశామన్నారు. 3ఎకరాల భూమికి 3లక్షలు దేవస్థానానికి చెల్లించేందుకు అంగీకరించి, రూ.80వేలు అప్పుడే డిపాజిట్ చేశామని తెలిపారు. మిగిలినది డిపాజిట్ చేసే సమయంలో ఈ భూములపై స్టే రావడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. వరాహగిరికాలనీ-1లో 2.6ఎకరాలు పార్ట్-2లో 40సెంట్లను అప్పటి దేవస్థానం సర్వేయర్లు కొలిచి, తమకు ఇచ్చారన్నారు. అనంతరం తమ సొసైటీ తరపున పేదలకు 60గజాల చొప్పున ప్లాట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ భూములను క్రమబద్ధీకరిస్తున్నందున, నాటి పరిస్థితులను, ప్రజల జీవన స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని సరైన ధరలు నిర్ణయించాలని కోరారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు.

రాములోరి పెళ్లికి రాట



విజయదుర్గా దేవి ఆలయంలో పెళ్లి రాట వేస్తున్న నిర్వాహకులు



మద్ది రామాలయం వద్ద వేస్తున్న పెళ్లి రాట

మధురవాడ: శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణానికి ఏడో వార్డు టైలర్స్ కాలనీ శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ఉడుపు రాట ఏర్పాటు కార్యక్రమాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విజయదుర్గాదేవి అమ్మవారికి, సీతారాములకు ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు శ్రీకాంత్ శర్మ నిర్వాహకులతో రాట ఏర్పాటు చేయించారు. ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మి, ధర్మకర్తల మండలి సభ్యులు తెంటు మాధవి, బంగారు ప్రకాశ్, బంగారు అశోక్, ఝాన్సీ దంపతులతో పాటు వంకాయల సాయికుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు వంకాయల మారుతీ ప్రసాద్, వంటికుల నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్ది, కృష్ణాపురం రామాలయాల్లో..

పద్మనాభం: సీతారాముల కల్యాణానికి సంబంధించి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పెళ్లి రాట ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మద్ది, కృష్ణాపురం గ్రామాల్లోని రామాలయాల వద్ద పెళ్లి రాటలు వేశారు. మద్దిలో జరిగిన పెళ్లి రాట ఉత్సవంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, సర్పంచ్ బుగత సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు తులసి లక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు స్పందన



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు



ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపీడీవో జానకి

పద్మనాభం: కార్పొరేషన్ల రుణాల మంజూరు కోసం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 342 మంది హాజరయ్యారు. 374 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 32 మంది గైర్హాజరయ్యారు. ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఈవోఆర్డీ మీనా కుమారి, మండల పరిషత్ ఏవో జయ ఉమ, బ్యాంకు మేనేజర్లు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఆనందపురంలో..

తగరపువలస: ఆనందపురం మండలంలో వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం ఆన్‌లైన్ ద్వారా మొత్తం 848 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో వి.జానకి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం చందక, వేములవలస, ఆనందపురం, వెల్లంకి గ్రామ పంచాయతీల నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 203 మంది హాజరయ్యారని తెలిపారు. హాజరుకాని దరఖాస్తుదారులతో పాటు మిగిలిన పంచాయతీల వారు ఈ నెల 7వ తేదీన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీజీబీవీ శొంఠ్యాం, వేములవలస, బ్యాంక్ ఆఫ్ బరోడా వేములవలస, బ్యాంకు ఆఫ్ ఇండియా గిడిజాల, ఆనందపురం, ఇండియన్ బ్యాంక్ గంభీరం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శొంఠ్యాం, వెల్లంకి బ్రాంచ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.